Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 155 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 24 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రపంచ ఆర్థిక వేదిక..ఏపీకి పెట్టుబడుల వేడుక

**- 4 రోజుల దావోస్ సదస్సులో 45 సమావేశాల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్**

**- ఆంధ్రప్రదేశ్ అనుకూలతలను ప్రపంచానికి వినిపించిన యువగళం**

**- పుట్టిన రోజు నాడు దావోస్‌లో పెట్టుబడుల వేట ఆపని యువనేత**

**- దావోస్ నుంచి బయలుదేరిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**



**దావోస్ (స్విట్జర్లాండ్):** పుట్టినరోజు నాడు వేడుకలకు దూరంగా దేశం కాని దేశంలో పెట్టుబడుల వేట కొనసాగిస్తూనే ఉన్నారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు చివరి రోజున (గురువారం) రాత్రి పొద్దుపోయే వరకు దావోస్ లో పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరిపారు, సమావేశాలలో పాల్గొన్నారు మంత్రి నారా లోకేష్. ఈ అంకితభావం, పట్టుదలే ఆయనను దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన, ప్రతిభావంతమైన యువనేతగా నిలిపాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రిగా లోకేష్ పడుతున్న తపన ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రతినిధులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. నాలుగు రోజుల పాటు దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాలు ముగిశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న యువమంత్రి లోకేష్ అవిశ్రాంతంగా పెట్టుబడి చర్చలు కొనసాగించారు. ఈ 4 రోజుల్లో మంత్రి నారా లోకేష్ మొత్తం 45 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలతో 25 ముఖాముఖి చర్చలు, 2 గవర్నమెంటు టు గవర్నమెంట్ సమావేశాలు, 4 కాంగ్రెస్ సెషన్లు, 8 రౌండ్ టేబుల్ సమావేశాలు, 5 ఇంటర్నేషనల్ మీడియా ఇంటరాక్షన్స్‌లో ఆంధ్రప్రదేశ్ వనరులు, శక్తిసామర్థ్యాలు, రాయితీలు, అనుకూలతలను అద్భుతంగా వినిపించారు. మంత్రి లోకేష్ చొరవతో జార్ఖండ్ సంస్థ రాష్ట్రంలో $10 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇది కేవలం ఆరంభం మాత్రమే. గత వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో చర్చలు జరిపిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు 2.5 లక్షల కోట్ల పెట్టుబడులను గ్రౌండ్ చేశాయి. ఈసారి జరిగిన సమావేశాల్లో పెట్టుబడిదారుల ఆసక్తిని గమనిస్తే అంతకు రెట్టింపు స్థాయిలో ఈసారి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా ఏపీలో అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో అనుమతులు, చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వం పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమోదించిన 25 పారిశ్రామిక పాలసీలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంలో ఏపీ బృంద నాయకుడిగా నారా లోకేష్ సక్సెస్ అయ్యారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా ఏపీకి పెట్టుబడుల వేడుక తీసుకు రానున్న మంత్రి లోకేష్, దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని బయలుదేరారు. శనివారం ఉదయానికి హైదరాబాద్ చేరుకుంటారు.

## గోదావరి పుష్కర పనులపై తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యున్నత స్థాయి సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** జూన్ 26, 2027 నుంచి జూలై 7, 2027 వరకు 12 రోజుల పాటు జరుగనున్న గోదావరి పుష్కరాలపై సమీక్షలో చర్చ. గోదావరి ప్రవహించే పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ ఆరు జిల్లాలో పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు గోదావరి పుష్కరాలపై సమీక్షకు ముందుగా ముఖ్యమంత్రికి వేద పండింతుల ఆశీర్వచనం. ముఖ్యమంత్రిగా తన హయాంలో 3వ మారు గోదావరి పుష్కరాలు నిర్వహించడం తన అదృష్టమని వ్యాఖ్యానించిన సీఎం. ప్రస్తుతం ఉన్న 234 ఘాట్లతో పాటు కొత్తగా 139 ఘాట్లను నిర్మించాలని ప్రణాళిక. మొత్తంగా వేర్వేరు ప్రాంతాల్లో నదీ తీరం వెంబడి 9918 మీటర్ల పొడవున 373 ఘాట్లు అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపకల్పన. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు గోదావరి పుష్కర స్నానం ఆచరించేందుకు రాష్ట్రానికి వస్తారని అంచనా. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చూడాలని నిర్దేశించిన ముఖ్యమంత్రి. సమీక్షకు హాజరైన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనిత, నారాయణ, నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.

## ఎస్ఆర్‌కె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి








**గన్నవరం, (రాజధాని వార్తలు):** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ మై భారత్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో ఈరోజు గన్నవరం నియోజవర్గం ఎనికెపాడు ఎస్ఆర్‌కె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెమినార్ హాల్ నందు నేతాజీ జయంతి సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని ఎన్ఎస్ఎస్ యూనిట్‌తో కలిసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు సుభాష్ చంద్రబోస్ పటానికి పూలమాలలు అర్పించి కార్యక్రమమును ప్రారంభించారు. మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ అనే సంస్థను స్థాపించి స్వాతంత్రం కోసం పోరాటమే ఆయుధమని వీరోచితంగా సైనికులు తయారుచేసి స్వాతంత్ర్యం రావడంలో తన వంతు పాత్రను వహించిన సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని యువత అంతా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల్లో మాట్లాడవలసిన వారిలో ముందు వరుసలో సుభాష్ చంద్రబోస్ ఉంటారని ఆయన చేసిన సేవలు స్వాతంత్రం రావడంలో ఆయన చేసిన పోరాటం ఎంతో ప్రాముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె రమేష్ ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి చిన్ని మరియు విద్యార్థులు యువత పాల్గొన్నారు.

## సెలవులో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ 15 రోజుల సెలవుపై తైవాన్ వెళుతున్నారు. ఆయన ఈ నెల 31వ తేదీ నుంచి వెళ్తున్నట్లు సమాచారం.



## కానుమోలు హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు నిర్వహించిన కళ్లేపల్లి



**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** వసంత పంచమి పర్వదినం సందర్భంగా శుక్రవారం బాపులపాడు మండలం కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రిటైర్డ్ ఉద్యోగి,లయన్ కళ్ళేపల్లి నారాయణరావు, లక్ష్మీ ఆధ్వర్యంలో వారు గతంలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, కానుమోలు మాజీ సర్పంచులు చింతల వెంకట శివ అప్పారావు, దన్నే దుర్గారావు, సీనియర్ జర్నలిస్ట్ తాడి రంగారావు, మోగంటి వేంకటేశ్వరరావు (కొండ) అంబళ్ళ వెంకట రంగారావు, ఎన్ వి ఎస్ గంగాధరరావు, సుంకర సాంబశివరావు, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సరస్వతి దేవికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ స్వీట్స్ ఫ్రూట్స్ పంపిణీ చేశారు.

## రిపబ్లిక్ వేడుకలకు సిద్ధమవుతున్న అమరావతి





**అమరావతి, (రాజధాని వార్తలు):** మొదటిసారి నవ్యాంధ్ర రాజధానిలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ. సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో మంత్రుల బంగ్లాల ఎదురుగా పెరేడ్ గ్రౌండ్ ఏర్పాటు. రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నారాయణ. 22 ఎకరాల్లో పెరేడ్ గ్రౌండ్, వీవీఐపీ, వీఐపీ పార్కింగ్‌కు 15 ఎకరాలు, పబ్లిక్ పార్కింగ్‌కు 25 ఎకరాలు ఏర్పాటు. అమరావతి రైతులకు ప్రత్యేకంగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు. వేడుకలకు హాజరు కావలసిందిగా రైతులకు ఆహ్వాన పత్రికలు పంపుతున్న అధికారులు. మొత్తం 13 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్న సీఆర్డీఏ అధికారులు. వేడుకలకు హాజరయ్యే వీఐపీలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

## హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా సీమ జిల్లాలకు నీటి తరలింపులో సరికొత్త రికార్డు సృష్టించిన ఏపీ ఇరిగేషన్ శాఖ

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రాజెక్ట్ డిజైన్ కెపాసిటీని మించి తొలిసారి నీటిని డ్రా చేసిన హంద్రీ-నీవా ప్రాజెక్ట్. హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి కేవలం 190 రోజుల్లోనే 40.109 టీఎంసీల మేర నీటిని కాల్వలకు మళ్లించిన ఇరిగేషన్ శాఖ. 190 రోజుల్లో 40.109 టీఎంసీల నీటిని రాయలసీమ జిల్లాలకు చెందిన రిజర్వాయర్లు, చెరువులకు మళ్లించిన అధికారులు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలోనే 1 పంపు నుంచి 6 పంపుల ద్వారా నీటిని డ్రా చేసేలా సామర్థ్యం పెంపు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక 12 పంపుల ద్వారా నీటిని తోడేందుకు సామర్థ్యాన్ని పెంచేలా పనులు. 12 పంపుల ఏర్పాటుతో పాటు... వంద రోజుల్లో కాల్వల వెడల్పు పనులను రికార్డు స్థాయిలో పూర్తి చేసిన ప్రభుత్వం. హంద్రీ-నీవా విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టి... సీమ ప్రాంతానికి నీళ్లందించేలా కృషి చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాస్. గురువారం నాటికి ప్రాజెక్ట్ డిజైన్ కెపాసిటీని మించి 40.109 టీఎంసీల నీటిని డ్రా చేసి రికార్డ్ సృష్టించామని సీఎంతో చెప్పిన మంత్రులు పయ్యావుల, బీసీ జనార్దన్ రెడ్డి. హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి స్థాయిలో సద్వినియోగమయ్యేలా ప్రణాళికతో సీఎం వ్యవహరించారన్న మంత్రి పయ్యావుల. సీఎంతో పాటు...



హంద్రీ-నీవా పనులకు సహకరించిన ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు ధన్యవాదాలు తెలిపిన సీమ మంత్రులు. రాయలసీమ ప్రాంతంలోని అన్ని రిజర్వాయర్లను, చెరువులను నీటితో నింపాలన్న ముఖ్యమంత్రి. చివరి ఎకరా వరకు నీళ్లందించాలని.. సీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేలా పని చేయాలన్న సీఎం చంద్రబాబు. హంద్రీ-నీవా నుంచి 50 టీఎంసీల మేర నీటిని డ్రా చేసి మరో రికార్డు సృష్టించాలని మంత్రి నిమ్మలకు సీఎం చంద్రబాబు ఆదేశం. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి తొలివారంలోగా 50 టీఎంసీల నీటిని హంద్రీ-నీవా కాల్వల నుంచి రాయలసీమ జిల్లాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని సీఎంకు వివరించిన మంత్రి నిమ్మల.

# ముస్లిం వివాహానికి వాసుపల్లి రూ. 5,000 లు చేయూత

## - మాజీ ఎమ్మెల్యేకి శుభలేఖ అందజేసిన మహమ్మద్ నజీమ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజకవర్గ ప్రజా బంధువు, మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ముస్లిం వివాహానికి 5,000 ఆర్థిక సహాయం చేశారు. ముస్లిం వర్గానికి చెందిన మహమ్మద్ నజీమ్ తన కుమార్తె వివాహ పత్రికను 39వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, మైనార్టీ సోదరులతో కలిసి వాసుపల్లికి అందజేశారు. దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మైనార్టీలు వైసీపీ శ్రేణులు తన కుటుంబ సభ్యులని తన వంతు బహుమతిగా సాయం అందజేసినట్లు వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ముబసిర, హాఫీజ్ దంపతుల వివాహ వేడుకకు హాజరు కావాలని కోరుతూ పెళ్లి కుమార్తె తండ్రి శుభలేఖ పత్రికను అందజేశారు. వాసుపల్లి స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ లండ రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామరాజు, 39వ వార్డు ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, 38వ వార్డ్ ప్రెసిడెంట్ గురజారపు రవి, అరుగుల రాజు, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, చేపల రాజు, చింతకాయల వాసు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయం తథ్యం

## - కన్నబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైసీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ను విశాఖపట్నం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కలిశారు. న్యూ ఇయర్‌లో విశాఖకు మొట్టమొదటిసారిగా వచ్చిన కన్నబాబుకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, వచ్చే మార్చిలో జరిగే జీవీఎంసి ఎన్నికల్లో వైసీపీ విజయం తథ్యం అన్నారు. కూటమి సర్కార్ పనితీరుతో ప్రజలు విసిగిపోయారు అన్నారు. అలాగే, 50 ఏళ్ళు నిండిన వారికి పెన్షన్లు ఇవ్వడం లేదని వాపోయారు. అలాగే, 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఇస్తామన్న నగదు ఇవ్వడం లేదన్నారు. తల్లికి వందనం చాలా మందికి అందడం లేదని గుర్తు చేశారు. జగన్ పాదయాత్ర విశాఖలో విజయవంతం చేయడంలో అహర్నిశలు కృషి చేస్తామన్నారు. గతంలో కోటి సంతకాల సేకరణ దక్షిణంలో విజయవంతంగా పూర్తి చేశామని గుర్తు చేశారు. విశాఖలో పార్టీ పరిస్థితి పటిష్టం అవుతోందన్నారు. అన్ని ఆందోళన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

# 48వ వార్డులో యుద్ధప్రాతిపదికన నూతన రోడ్లు నిర్మాణం చేపట్టిన గంకల కవిత అప్పారావు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కొండవాలు ప్రాంతపు రూపు రేఖలను గుడ్ మార్నింగ్ గంకల మార్చుతుందని 48వ వార్డ్ కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు స్పష్టికరణ చేసారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని వచ్చిన పిర్యాదు మేరకు బాపూజీ ప్రాంతంలో పర్యటన చేసి జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించి నిధులు సమకూర్చి గురువా రం నూతన రోడ్డు నిర్మాణం శరవేగంగా పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు గురువారం నాడు నేరుగా నూతన రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షణ చేసారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్మాణ పనులలో కార్మికులతో కలిసి పనులను పర్యవేక్షణ చేసి గ్రామస్థు లలో ఆనందం నింపారు. నేరుగా సమీక్షా చేసి అభివృద్ధి పనులు జాప్యం లేకుండా త్వరతగతిన యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలనీ అన్నారు. ఈ సందర్బంగా గ్రామస్థులతో కలిసి వార్డులో పర్యవేక్షణ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 48వ వార్డులో మెయిన్ సర్వీస్ లైన్ విద్యుత్ తీగలు బాగా కిందకు వేలబడి, కొన్నిచోట్ల గృహ సముదాయాలను కూడా తాకుతూ ఉన్నాయని వాటిని సరి చేయాలని గతంలో ఏపీఈపిడిసిఎల్ సీఎండికు పిర్యాదు చేశారు. పిర్యాదుపై గురువారం అధికారులతో గంకల కవిత అప్పారావు పర్యటన చేసి మరమ్మత్తులు చేపట్టి, వేలాడే విద్యుత్ తీగలను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల నూతన కండక్టర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా గంకల కవిత అప్పారావు మాట్లాడుతూ వార్డులో బాపూజీ నగర్‌లో గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన పిర్యాదు మేరకు ఎప్పటికప్పుడు వార్డులో పర్యటన చేయడం జరుగుతుందని, గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో అందిన పిర్యాదు మేరకు బాపూజీ నగర్‌లో నూతన రోడ్లు నిర్మాణం చేయాలనీ జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించి నూతన రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షణ చేయడం జరిగిందని, నూతన రోడ్డుతో కొండవాలు ప్రాంతపు రూపు రేఖలు మార్చుతున్నాయని, గ్రామస్థులతో కలిసి పర్యవేక్షణ చేసి అభివృద్ధి పనులను పరిశీలన చేయడం జరిగిందని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలపడం జరిగిందని మరియు కొన్ని నేరుగా సమీక్షించి సమస్య నెరవేర్చడం జరిగిందని అన్నారు. వార్డులో ఎప్పటినుంచో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాద స్థాయికి చేరుకోవడం జరిగిందని దీనిపై గతంలో ఎలక్ట్రికల్ సిఎండి పృథ్వి రాజ్‌కు వినతి అందజేయడం జరిగిందని వినతి మేరకు ఈరోజు అధికారులతో కలిసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి, పలుచోట్ల నూతన కండక్టర్లను నూతన విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగల వల్ల వచ్చే ప్రమాదకర స్థాయిని తగ్గించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల తరపున ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి పృథ్వీరాజ్ కు గంకల కవిత అప్పారావు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని అన్నారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల తక్షణమే చర్యలు చేపట్టిన వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు కృషి పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టు గౌరవాన్ని కించపరిచే దుష్ప్రచారాన్ని ఆపండి

## - వైఎస్సార్సీపీ సోషల్ మీడియాపై చర్యలు కోరుతూ రూరల్ పాత్రికేయుల ఫిర్యాదు





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** జర్నలిస్టులపై వైఎస్సార్సీపీ సోషల్ మీడియా వర్గాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నిలువరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడ రూరల్ పాత్రికేయులు సర్పవరం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదు చేసేందుకు ముందుగా ఎండిఓ కార్యాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్ మీదుగా సర్పవరం పోలీస్ స్టేషన్ వరకు పాత్రికేయులు ప్లేకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా గౌరవం కోల్పోనివ్వం, “దుష్ప్రచారానికి చెక్ పెట్టాలి” వంటి నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఐ పెద్దిరాజుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు దాసరి శ్రీనివాస్, ధర్మరాజులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా వైఎస్సార్సీపీ సోషల్ మీడియా ఫేస్‌బుక్ పేజీల్లో జర్నలిస్టులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అండతో పేకాట, బెల్ట్ షాపుల వద్ద వసూళ్లు చేస్తున్నారంటూ నిరాధార పోస్టులు చేయడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఎప్పుడూ పార్టీలకతీతంగా ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడానికి కట్టుబడి ఉంటారని, రాజకీయ ప్రయోజనాల కోసం మీడియాను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని




వారు పేర్కొన్నారు. గత వారం రోజుల్లో ఒక సీనియర్ పాత్రికేయుడిపై వైఎస్సార్సీపీ నాయ కుల దాడి జరిగిన విషయం ప్రస్తావిస్తూ, ఇప్పుడు సోషల్ మీడియాలో “వసూళ్లు చేసే జర్నలిస్టులు” అంటూ అవమానకర పోస్టులు రావడం విచారకర మని తెలిపారు. దుష్ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా నిర్వాహకులను గుర్తించి, సైబర్ చట్టాల ప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐకి సమర్పించిన ఫిర్యాదులో డిమాండ్ చేశారు. “న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది. రాష్ట్రం నలుమూలల పాత్రికేయులు స్పందించాలని పాత్రికేయులు స్పష్టం చేశారు.







**సచివాలయంలో నిర్వహించిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సీఎస్ విజయానంద్ పలువురు మంత్రులు, వివిధ బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.**

# 26న రాష్ట్ర శాసన మండలి, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టుల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26వ తేది సోమవారం ఉదయం 8 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగే వేడుకల్లో శాసన మండలి అధ్యక్షులు కె.మోషేన్ రాజు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఉ.8.15 గం.లకు రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

**సచివాలయం మొదటి భవనం:**

ఏపి సచివాలయం మొదటి భవనం వద్ద సోమవారం ఉ.7.30 గం.లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

**రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం:**

నేలపాడులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద సోమవారం ఉ.10 గం.లకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.



**నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు.**

# కావమ్మ పేరంటాల ఆలయం వద్ద భారీ అన్నదానం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పాతివ్రత్యానికి మారుపేరుగా నిలిచిన సామర్లకోట కావమ్మ పేరంటాలి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ నిర్వాహకులైన సుఖపట్ల కుటుంబీకులు ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహించే అమ్మవారిని తీర్థ ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), పట్టణ మహిళా అధ్యక్షురాలు బొందల రామలక్ష్మిలు ముఖ్య అతిధులుగా పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూడు వేల మంది ప్రజలు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు సుఖపట్ల నాగేశ్వరరావు, వారి సోదరుల కుటుంబాలు, నాయకులు శెట్టి భక్తుల దుర్గ, ఆలయ కమిటీ నాయకులు పాల్గొని సేవలందించారు.

# ప్రతీ ఎకరా వరి పంటకు నీరందేలా చర్యలు చేపట్టాలి

## - రైతులకు ఉపయోగపడే పనుల ప్రతిపాదనను సిద్ధం చేయాలి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఈ రబీ సీజన్‌లో ప్రతి ఎకరా వరి పంటకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలా పురం నియోజకవర్గం అల్లవరం మండలం కొమరిగిరి పట్నంలో అల్లవరం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ దాట్ల గోపిరాజు ఆధ్వర్యంలో అల్లవరం, అమలా పురం, ఉప్పలగుప్తం డిస్ట్రిబ్యూటరి కమిటీ పరిధిలో ఉన్న వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చైర్మన్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఇరిగేషన్, డ్రైన్స్ సమస్యలపై సమా వేశంలో చర్చించారు. రబీలో ప్రతి వరి పంటకు సాగు నీరు అదేలా ప్రతి సంఘ సభ్యులు చర్య తీసుకోవాలి శ్రీనివాస్ అన్నారు. నీటి సంఘం అధ్యక్షులు వారి పరిధిలోని అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కాలువల క్లోజర్ టైంలో రైతులకు ఉపయోగపడే ప్రతి ముఖ్యమైన పనులను సంబంధిత అధికారులతో కాలువలును పర్యవేక్షించి ప్రతిపాదనలు తయారు చేసి నీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ సంఘ అధ్యక్షులు ద్వారా డివిజన్ కార్యాలయానికి అందచేయాలన్నారు. గతంలో నీరు చెట్టు సంబంధించిన డిపాజిట్ అమౌంట్‌ల విషయమై ప్రాజెక్ట్ కమిటీ సమావేశంలో తీర్మానించి ప్రభుత్వానికి పంపగా ఈ నెల 14వ తేదీన వారి ఎకౌంట్లో ఖాతాకు నగదు జమ చేయడం జరిగింది అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని సాగునీరు విషయంలో అలసత్వం వహించకుండా శివారు ఆయకట్టుకు సైతం నీరు అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, డ్రైన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం వి వి కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్ధన్, అమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాజులపూడి వెంకటేశ్వరరావు, అల్లవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ బండారు వెంకన్నబాబు, అమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చింతపల్లి సత్యనారాయణ, బెండమూర్లలంక నీటి సంఘం అధ్యక్షులు రత్న ప్రసాద్, దేవగుప్తం నీటి సంఘము అధ్యక్షులు మేడిద సత్య నారాయణ, గోడిలంక నీటి సంఘము అధ్యక్షులు సత్య ప్రసాద్, చేయ్యురు నీటి సంఘం అధ్యక్షులు యానమదల బాలాజీ, రెడ్డిపల్లి నీటి సంఘము అధ్యక్షులు సాయిబాబు, తాడికొన నీటి సంఘము అధ్యక్షులు సలాది నాగబాబు, ఉప్పలగుప్తం నీటి సంఘము అధ్యక్షులు మోటూరి రవి శంకర్, ఎస్ యానాం నీటి సంఘము అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, చేయ్యురు నీటి సంఘం ఉపాధ్యక్షులు ఆకుల వెంకట రెడ్డి నాయుడు, అమలాపురం ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ రామ కృష్ణ, అమలాపురం డ్రైన్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సునీత, అయినపురం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్, కొమరిగిరిపట్నం నీటి సంఘం ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేశ్వరావు, కొమరిగిరి పట్నం నీటి సంఘం డైరెక్టర్లు కొప్పిశెట్టి సత్యనారాయణ, కడలి గోవిందరావు, కాట్రూ శ్రీనివాస్ కుమార్, మంతెన వెంకట సుబ్బరాజు, అడ్డగళ్ళ వెంకట స్వామి, ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయేల్ నీదంతా నీచ చరిత్రే

## - ఇజ్రాయేల్ విమర్శలపై విరుచుకుపడ్డ కూటమి నేతలు - ఇస్రాయేల్ నోరు అదుపులో పెట్టుకో... లేకుంటే బడితి పూజే

## - ఎమ్మెల్యే ఆనందరావు అభివృద్ధిని విమర్శించే అర్హత నీకు లేదు - టిడిపి ఎస్సీ సెల్, జనసేన నేతల ధ్వజం





**అమలాపురం, (రాజధాని వార్తలు):** సూరసాని యానాం ఆంధ్రా గోవా కోకో బీచ్ సంక్రాంతి సంబరాల విషయంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చేసిన ఆరోపణలపై కూటమి, టిడిపి ఎస్సీ సెల్ నేతలు ఖండిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యానం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నిర్వహించిన సంక్రాంతి సంబరాలపై ఓర్వలేక ఇస్రాయేల్ చేసిన వాక్యాలను పలు ప్రాంతాలలో నిర్వహించిన సమావేశంలో నేతలు ఖండించారు. గురువారం ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఈతకోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఇజ్రాయేల్‌పై నిప్పులు చెరిగారు. అసూయతోనే విమర్శలు... ఎమ్మెల్యే ఆనందరావు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే అది చూసి ఓర్వలేక ఇస్రాయేల్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారనీ తనను ఉత్సవాలకు పిలవలేదనే కక్షతోనే అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. సంక్రాంతి ఉత్సవాలకు యానం బీచ్‌కు సుమారు 5 లక్షలకు పైగా పర్యాటకలతో సంబరాలు సక్సెస్ ఫుల్‌గా నిర్వహిస్తే ఓర్వలేక అవాకులు చవాకులు పేలుతున్నావని పద్ధతి మార్చుకోకపోతే బడితి పూజ తప్పదని పలువురు నేతలు ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు...

**నీ గతం మర్చిపోయావా..బొమ్మి**

గత నీ చరిత్ర ఏమిటో ఒక్కసారి గుర్తుకు తెచ్చు కుని మాట్లాడితే బాగుంటుందని నీ చరిత్ర నియోజక వర్గ ప్రజలందరికీ తెలుసనని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు స్టేజ్‌పై రికార్డింగ్ డాన్సులు వేయించి, కోడిపుంజులు పట్టుకుని కోడిపందాలు ఆడించి, గుండాటల వద్ద డబ్బులు పోగు చేసుకుని అల్లరి చిల్లరి రాజకీయాలు చేసిన నీవు ఒక పవి త్రమైన పండుగను ప్రజా ఉత్సవంగా నిర్వహించిన ఆనందరావును విమర్శించే స్థాయి నీకులేదని హెచ్చరించారు.

**అధికారులను భయపెట్టడం నీ నీచ సంస్కృతి..**

నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వేడుకలను జయ ప్రదం చేసిన ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురి చేసేలా మాట్లాడటం పోలీసు అధికారులను బ్రోకర్లు అని సంబోధించడం నీ నీచ బుద్ధికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

**అంబేద్కర్ విరోధులకు కొమ్ముకాసిన చరిత్ర నీది కాదా బొమ్మి...**

దళిత జాతిలో పుట్టిన నీవు బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని విమర్శించే వారికి అండగా నిలబడి అడ్డదారిలో పదవి తెచ్చుకున్న నీకు నైతిక విలువలు లేవని చావుల దగ్గర కూడా డబ్బులు దోచుకునే నీచ చరిత్ర నీదని నాగేశ్వరరావు విమర్శించారు. ఆనందరావుకు తెలిసింది కేవలం అభివృద్ధి మాత్రమే అలాంటి వ్యక్తిపై బురద జల్లాలని చూస్తే ఎస్సీ సెల్ తరఫున తగిన గుణపాఠం చెబుతాం అని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, గోసంగి స్థాలిన్, రేవు తిరుపతి రావు, వంగలపూడి నర్సింహామూర్తి, పండు వెంకటేశ్వరరావు, అయితాబత్తుల శేఖర్, కన్నీడి రమేష్, ఆకుమర్తి రమేష్, దేవరపల్లి వీరేష్ కుమార్, నూటుకుర్తి చిన్న, బడుగు సత్యనారాయణ, బత్తుల సాయి, నామాడి తారక్, పలివెల రాంబాబు, ముత్తాబత్తుల వెంకటరమణ, కాట్రూ కృష్ణ, మందా గేద్దయ్య, మధుర ప్రతాప్, పచ్చిమాల ఏడుకొండలు, మధుర నర్సింహామూర్తి, కాశి వెంకట్రావు, నల్లమిల్లి ఉపసర్పంచ్ రమణ, గోసంగి ఆనందరావు, కుంచే రమేష్, బుడితి రాజు, సర్పంచ్ నక్క కృష్ణ, పరమట మోహన్, బళ్ళ సత్యనారాయణ, పోతుల బుజ్జి మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇన్వర్టర్ బహుకరణ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పేరి పార్వతీశ్వర శాస్త్రి ఇన్వెటర్‌ను బహుకరించారు. కమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామ మేరకవీధికి చెందిన పార్వతీశ్వర శాస్త్రి నలభై వేల రూపాయల విలువ చేసే ఇన్వర్టర్‌ను బహుకరించారని ప్రిన్సిపాల్ డా.వి.నరసింహస్వామి తెలిపారు. ఇన్వర్టర్‌ను బహుకరించిన పేరి పార్వతీశ్వర శాస్త్రిని అభినందిస్తూ దుస్సాలువాతో సన్మానించారు. పెద్ద మనసుతో గ్రామస్థులు కళాశాల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. అధ్యాపకులు కరుణశ్రీ, డా.బాలస్వామి, డా.ఆశిష్ బాబు, పి.శేఖర్, ఎం.త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరి పార్వతీశ్వర శాస్త్రి, మంద ఫణికుమార్, అమ్ము మూర్తి, అమ్ము వెంకటేష్‌లకు ప్రిన్సిపాల్ నరసింహస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదలకు రగ్గులు పంపిణీ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ధర్మపత్ని ధనలక్ష్మి 3వ వర్ధంతి సందర్భంగా పేదలకు ఉచితంగా రగులు పంపిణీ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా బండారులంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నివాసం వద్ద గురువారం 300 మంది నిరుపేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వూటుకూరి వీరబ్ర హ్మం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వారి కుటుంబ సభ్యులు వూటుకూరి సోమ రాజు, వాణి సునీత దేవి, వూటుకూరి వీరబ్రహ్మం (బాబి) గీతిక, జాన సోమరాజు, నాగేశ్వరి, నూలు ఏసురాజు సీత, జాన నరేష్, భవాని బండారులంక గ్రామ పెద్దలు పిచ్చిక శ్యామ్, బల్ల వెంకటేశ్వరరావు, చింతపట్ల గంగా సత్యనారాయణ, ఇనుమర్తి లింగ మూర్తి, గుత్తుల సత్తిబాబు, ఇనుమర్తి సతీష్, వి ఎస్ ఎం షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత విలువైనదో ప్రతి పౌరుడికి గుర్తు చేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ కాంచనమ్మ పేర్కొన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలనందు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాటలు, చిత్రలేఖనం, స్విమ్మింగ్, ఈజీ రైటింగ్, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నియోజకవర్గ పరిధిలోని గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే సురేష్ రెడ్డి అను విద్యార్థి ఓటు హక్కు వినియోగం, ఎన్నికల్లో మద్యం, డబ్బు వినియోగంపై ప్రసంగం విద్యార్థులను, ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఓ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కును 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు, క్విజ్ పోటీలు, అవగాహన సదస్సులు, ప్రసంగాలు నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి కాంచనమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు వేయడం మనందరి బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలపై అవగాహన కల్పించాలని ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి ఆమె తెలిపారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని, ఓటు హక్కుపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆమె తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించడం విశేషం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మీ చేతుల్లో మీ భవిష్యత్తు : చిట్టమూరు ఎస్సై

## - టిఎంఆర్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించిన స్థానిక ఎస్సై నాగరాజు - ఎస్పీ ఆదేశాలతో డి.ఎస్.పి పర్యవేక్షణలో ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**గూడూరు, (రాజధాని వార్తలు):** చిట్టమూరు మండల కేంద్రమైన కొత్తగుంట టిఎంఆర్ కాలేజ్ విద్యార్థులకు ఎస్పీ ఆదేశాల మేరకు డి.ఎస్.పి పర్యవేక్షణలో చిట్టమూరు మండలం స్థానిక ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం టిఎంఆర్ కాలేజీ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ. పిల్లలు బాగా చదువుకొని మంచి ఉన్న స్థానానికి చేరుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశయాలను ఆశలను పెట్టుకుని కాలేజీలకు స్కూళ్లకు పంపుతారని ఆ నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా మంచి ఉద్యోగాలు సాధించి వాళ్ళ నమ్మకాన్ని నిజం చేయాలని అలానే పిల్లలకు క్రమశిక్షణ అన్నది చాలా విలువైనదని అలాంటి విలువైన క్రమశిక్షణని మనం వృధా చేయకూడదని ఆలా చేస్తే చదువుకున్న దానికి అర్ధం లేదు అని పెద్ద చిన్న గురువు దైవాన్ని అనుసరించి ముందుకు సాగాలని అన్నారు. పిల్లలకు చందువు, వల్ల వచ్చే ఉపయోగాలు,సెల్‌ఫోన్ల వలన వచ్చే నష్టాలు, మద్యం సేవిస్తే వచ్చే సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలపై అవగాహనా, విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాలు, హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే నష్టాలు మరి ముఖ్యంగా ఆడపిల్లలకు రక్షణపై అవగాహన ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి పూర్తిగా వివరించారు. వారికి భరోసాగా ప్రభుత్వం నియమించిన టోల్ ఫ్రీ నెంబర్ను 112 లేదా 1091 నంబర్‌కి రక్షణ కోసం అత్యవసర పరిస్థితుల్లో డయల్ చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నాగరాజు ఆయన సిబ్బందులు, టిఎంఆర్ కన్స్పెండెంట్ తమ్మినేని మనోహర్ రెడ్డి, ప్రిన్సిపల్ రాహంతుల్లా, ఆశ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజ్యాంగస్ఫూర్తితో రాజకీయ నైతికత

రాజకీయ సంక్షోభాలు ప్రజాస్వామ్య వ్యవస్థల సత్య క్షణాలు (మూమెంట్స్ ఆఫ్ ట్రూత్). ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ బలమూ, బలహీనతా సంక్షోభ సమయంలో వెల్లడవుతాయి. ఈ దృష్ట్యా రాజకీయ ఆలోచనలు కొత్త రీతుల్లో జరిగేందుకు రాజకీయ సంక్షోభం ఒక ప్రత్యేక అవకాశం కల్పిస్తుంది. లోతైన, దార్శనిక చింతనకు అదొక సందర్భమవుతుంది. చుట్టుముట్టిన సమస్యలను సమగ్రంగా వివేచించి, భవిష్యత్తులో వాటికి తావివ్వని రీతిలో పరిస్థితులను చక్కదిద్దేందుకు పురిగొల్పు తుంది. అప్పుడు సదరు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రస్థానం మళ్లీ హేతుబద్ధంగా సాగుతుంది. చెప్పవచ్చినదేమిటంటే ఇప్పుడు మనమూ ఒక రాజకీయ సంక్షోభంలో ఉన్నాం. మన ప్రజాస్వామ్యం పతన దిశలో ఉంది. భారత రాజ్యాంగానికి, మన నాగరికతా విలువలకు సవాళ్లు తీవ్రమవుతున్నాయి. అవును, మనం ఒక సంక్షోభంలో ఉన్నాం. మన రాజ్యాంగాన్ని, నాగరికతా ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు మన రాజకీయ చింతన సమష్టి భావోద్వేగంతో విప్లవాత్మకంగా పరిణమించాలి. న్యూఢిల్లీలో ప్రపంచ పుస్తక ప్రదర్శనను సందర్శించిన మూడు రోజులూ మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం భవిష్యత్తును గురించిన ఆలోచనలే నన్ను ఆవహించి ఉన్నాయి. భావాల ఉత్సవంగా కాకుండా అధికార ప్రదర్శనగా మాత్రమే ఏటేటా ఈ పుస్తకాల పండుగ జరుగుతోంది. అరుదుగా దొరికే, విలువైన పుస్తకాలను విక్రయిస్తున్న స్టాల్ ప్రస్తుతం ఒక్కటీ కన్పించలేదు. వివిధ ప్రజా ఉద్యమాలకు సంబంధించిన పత్రికలు, పుస్తకాలు, పోస్టర్లు లభ్యమయ్యే స్టాల్ ఒక్కటి కూడా లేదు. కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ బృహత్ బొమ్మలూ, తుపాకులు పట్టుకుని తిరుగుతున్న సైనికులూనూ! (పుస్తక ప్రదర్శనలో సైనికులు ఎందుకు ఉన్నారని నన్ను అడగవద్దు సుమా!). ఇతరుల కంటే ఎక్కువగా కవులు తమ కాలపు సత్యాలను ఆవిష్కరిస్తారని నేను అనుకుంటాను. ఈ భావనతోనే, ప్రభవిస్తోన్న యువ కవులు అద్నాన్ కఫీల్ దర్వేష్ కొత్త కవితా సంపుటి 'లానత్ కా ప్యాలా', పరాగ్ పవన్ పద్యాలు 'జబ్ హోర్ హంసీ సందిగ్ధ్ థీ', విహాగ్ వైభవ్ కవితామాల 'మోర్చే పార్ విదాగీత్'ను శ్రద్ధాసక్తులతో చదివాను. రాజకీయ పరాయీకరణ, అణగారిన వర్గాల సామాజిక ఆక్రోశాలను ఈ కవులు తమ కవితల్లో చక్కగా వ్యక్తీకరించారు. అయితే కవిత్వం, ప్రజాస్వామ్యం మధ్య సమస్యాత్మక సంబంధం గురించి అపూర్వానంద్ రాసిన 'కవితా మే జనతంత్ర'కు రాసిన పరిచయంలో 'సమస్యల్లా సమకాలీన కవిత్వం నైరాశ్యాన్ని వ్యక్తం చేసేదిగా ఉండడమేనని' ప్రొఫెసర్ ప్రతాప్‌భాను మెహతా అభిప్రాయపడ్డారు. నిజమే, సమకాలీన కవిత్వం మనలను అప్పుడప్పుడు ఉత్తేజితులను చేస్తుంది. అయితే సమస్యల నుంచి బయటపడే మార్గమేదో చెప్పదు. ఆ మార్గమేదో తెలుసుకోవడానికి రాజనీతి గ్రంథాలే సరైనవి. ఈ విషయమై మొదట తప్పక పేర్కొనవలసిన పుస్తకం పార్థా ఛటర్జీ రాసిన 'ఫర్ ఎ జస్ట్ రిపబ్లిక్'. మనం మన ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఈనాడు ఉన్నచోటుకు ఎలా చేరుకున్నాం? అన్న విషయాన్ని నిశితంగా విశ్లేషించిన పుస్తకమది. అయితే ప్రస్తుత సమస్యాత్మక పరిస్థితులను అధిగమించి ముందుకు సాగేందుకు ఆయన సూచించిన మార్గం మనలను సరైన గమ్యానికి తీసుకుపోతుందా అని సందేహిస్తున్నాను. పార్లమెంటేరియన్‌గా మారిన విశ్వవిద్యాలయ ఆచార్యుడు మనోజ్ ఝా పుస్తకం, మణిశంకర్ అయ్యర్ పుస్తకం తప్పక చదవవలసినవి. రాజకీయ చరిత్రకు సంబంధించిన పుస్తకాలు మనకు మరింతగా తోడ్పడతాయి. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సంఘటనలపై కొత్త ఆలోచనలను పురిగొల్పే పుస్తకాలను 'ఓరియెంట్ బ్లాక్ స్వాన్' ప్రచురించింది. '50 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ ఎమర్జెన్సీ' వాటిలో ఒకటి. ఆ 'చీకటి రోజుల'నే కాకుండా ప్రస్తుత నిరంకుశ పాలనా ధోరణులనూ అర్థం చేసుకునేందుకు కూడా ఈ పుస్తకం విశేషంగా తోడ్పడుతుంది. ఇప్పుడు విస్మృతమైన ఇద్దరు ధీరోదాత్తుల జీవిత చరిత్రలు తప్పక చదవవలసినవి? ఒకటి, రాజగోపాల్‌సింగ్ వర్మ హిందీలో రాసిన 'మధు లిమాయే: ప్రతిరోధ్ కా పర్చామ్'; రెండోది, రాధికా కృష్ణన్ రాసిన 'శంకర్ గుహ నియోగి: ఎ పొలిటిక్స్ ఇన్ రెడ్ అండ్ గ్రీన్'. లిమాయే, నియోగి ఏ విలువలను సమున్నతం చేసేందుకు తమ జీవితాలను అంకితం చేశారో ఆ విలువలను ఇప్పుడు మనం గౌరవిస్తున్నామా అన్న సంశయం కలుగుతోంది. ఆ సమున్నత విలువలకు మూలాధారం భారత రాజ్యాంగం. మన రాజ్యాంగబద్ధ గణతంత్ర రాజ్య నిర్మాణం, మౌలిక సూత్రాలపై వర్తమాన ప్రాబల్య రాజకీయ శక్తులు చేస్తోన్న దాడి సహజంగానే వ్యవస్థాపక ఆలోచనలను ప్రగాఢంగా అధ్యయనం చేసేందుకు, రాజ్యాంగ దార్శనికతను కాపాడేందుకు ప్రజలను పురిగొల్పుతోంది. రోహిత్ దే, అర్నిత్ షాని సంయుక్తంగా రాసిన 'అసెంబ్లింగ్ ఇండియాస్ కాన్‌స్టిట్యూషన్: ఏ న్యూ డెమోక్రటిక్ హిస్టరీ' అందుకొక నిదర్శనం. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభలోని ఉన్నత వర్గాలు మాత్రమే రూపొందించలేదని, సాధారణ ప్రజలు, సమస్త మత సమూహాలవారూ అందులో క్రియాశీలంగా పాల్గొన్నారని ఆ పుస్తక రచయితలు స్ఫూర్తిదాయకంగా విపులీకరించారు. స్పీకింగ్ టైగర్ అనే ప్రచురణ సంస్థ 'భారత రాజ్యాంగ భావాలు' అన్న ఇతివృత్తంతో పలు పుస్తకాలు ప్రచురించింది. నళినీ రాజన్ ('సెక్యులరిజం: హౌ ఇండియా రీ షేప్డ్ ది ఐడియా), ప్రభాత్ పట్నాయక్ (సోషలిజం అండ్ ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్), జాన్ హారిస్ (లిబర్టీ), రాజ్‌మోహన్ గాంధీ (ఫ్రెటర్నిటీ: కాన్‌స్టిట్యూషనల్ నార్మ్ అండ్ హ్యూమన్ నీడ్), ఆనంద్ తెల్తుంబ్డే (దళిత్స్ అండ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్) మొదలైన మేధావులు భారత రాజ్యాంగ విశిష్టత గురించి విశదీకరించారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రశ్న కొంత భిన్నమైనది: మన గణతంత్ర రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు రాజ్యాంగంపై ఎంత వరకు ఆధారపడగలం? దీనిపై న్యాయశాస్త్ర పండితుడు గౌతమ్ భాటియా నిశితంగా తర్కించారు.

# ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతున్న అధికారుల నిర్లక్ష్యం

### - విశాఖ బీజేపీ మాజీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగర ఆహార భద్రతాధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారు తోందని విశాఖ నగర బీజేపీ మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఫుడ్ సేఫ్టీ అధికా రుల కార్యాలయ ప్రాంగణంలో వినియోగంలోకి రాని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ కేసులు విపరీతంగా పెరగడానికి ఆహార కల్తీయే ప్రధాన కారణ మన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార తయారీ, మరియు సరఫరా కేంద్రాలపై క్రమం తప్పకుండా దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటే కొంత వరకు ప్రస్తుత పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. 2024వ సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్గా ఇక్కడ ఆహార తనిఖీ వాహనాన్ని, యంత్రాలను ప్రారంభించారన్నారు. ప్రధాని ప్రారంభించి నేటికి సుమారు రెండు సంవత్సరములు కావస్తున్నప్పటికి ఆహార తనిఖీ వాహనం వినియోగం లోకి రాకపోవడం శోచనీయమన్నారు. దీనికి అధికారులు పూర్తి శ్రద్ధ వహించి కృషి చేయాలన్నారు. లేదంటే తాము త్వరలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇటీవల కాలంలో ఆహార కల్తీ వల్ల పలు ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతలకు గురి కావడం, వారిలో కొంతమంది మృత్యువాత పడటం తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆహార సరఫరా కేంద్రాల వద్ద ఆహార కల్తీ నిరోధక అధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించేటట్లు ఆహార భద్రతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ఆహార పదార్థాల విక్రేతల్లో కొంచెం భయం మరియు బాధ్యత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆహార భద్రతాధికారుల నిర్లక్ష్యం నశించాలని నినాదాలు చేశారు. వీటికి సమాధానంగా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఆహార భద్రతా వ్యాను ప్రారంభించి సుమారు రెండు సంవత్సరములు కావస్తున్న ప్పటికి దాని నిర్వహణకు అవసరమైన సిబ్బంది కొరత వల్ల దాన్ని వినియోగంలోకి తేలేకపోయామని, రాబోయే 15 రోజుల్లో దీనికి సంబంధించి సిబ్బంది నియామకాలు జరుగు తాయన్నారు. ఆ సిబ్బంది అందుబాటులోకి వచ్చిన వెంటనే దీన్ని వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. ఆహార భద్రత నియమాలు అతిక్రమించే వారిపై తమ పరిధిలో తాము దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఆహార భద్రతా తనిఖీ అధికారుల టోల్ ఫ్రీ నంబర్ అన్ని ఆహార సరఫరా కేంద్రాల వద్ద విక్రేతలు ప్రదర్శించేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మద్దిలపాలెం బీజేపీ మండల ప్రెసిడెంట్ డి.ఆనంద్, శివాజీ పాలెం బీజేపీ మండల ప్రెసిడెంట్ ధనరాజ్ నాయక్, 20వ వార్డు బీజేపీ ప్రెసిడెంట్ అనిల్, విశాఖ జిల్లా బీజేపీ సెక్రటరీ టి.భారతి, గాజువాక గోపాలపట్నం ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీనివాస్, అనకాపల్లి ఫుడ్ సేఫ్టీ అధికారి సతీష్, కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవాభావంతో ప్రతి ఒక్కరూ పని చేయాలి

### - స్ఫూర్తిదాయక సేవలందిస్తున్న డాక్టర్ కందులకు అభినందనలు - మానవత్వంతో ప్రతి ఒక్కరు స్పందించాలి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సేవాభావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. అల్లిపురం నేరెళ్ల కోనేరు వద్ద 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కార్యాల యంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 12 మంది పుష్పవతి అయిన అమ్మాయిలకు వెండి భరణిలు, పట్టు చీరలు, పసుపు కుంకుమలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కె.ఎన్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా, కార్పొరేటర్ గా విస్తృత సేవలు అందిస్తున్న డాక్టర్ కందుల నాగరాజును ఆయన అభినందించారు. సేవే దైవంగా భావించి, అందరికి అందుబాటులో ఉంటూ, నిస్వార్థ సేవలందిస్తు, అందరికీ ఆప్తుడుగా మారిన కందుల నాగరాజు ఎంతోమందికి స్ఫూర్తిదాయంగా నిలిచారని కొనియాడారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ సేవకు సరిహద్దులు, పరిమితులు లేవని చెప్పారు. సాటి వారికి సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మానవత్వంతో స్పందించి నిస్వార్థ సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో తాను సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో 32, 33, 34, 36వ వార్డులకు సంబంధించి పుష్పవతి అయిన 12 మంది అమ్మాయిలకు పట్టు చీరలు, వెండి భరణిలు, పసుపు కుంకుమలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే తమ ట్రస్ట్ నుంచి నూతన వధువులకు బంగారు తాళిబొట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుపేద విద్యార్థులకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు అండగా



ఉంటూ వారికి తన పరిధిలో సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ డాక్టర్ కందుల సేవలను కొనియాడారు. ధనంకంటే దానమే శాశ్వతమని, ఆ పేరును కందుల నిలబెడుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్ మాట్లాడుతూ ఎటువంటి స్వలభాపేక్ష లేకుండా ఎంతమందికి తన పరిధి మేరకు సహాయం చేస్తూ వస్తున్న డాక్టర్ కందుల నాగరాజు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దుర్గా, రమేష్, నీలిబాబు, శ్రీనుమచ్చ రాజు, నరేష్, రమేష్ పాడి, సీపీఐ బుజ్జి, బిజెపి వీరభద్రరావు, జనసేన మహిళా నేత నాగమణి, కె.కృష్ణ, కె.రమేష్, రాగతి తాతారావు, సోషల్ వర్కర్ గీత, అయేష, చిట్టెమ్మ, కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

# 35 వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### - 16.75 లక్షలతో యు జి డి వర్క్స్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ - ప్రసాద్ గార్డెన్స్ యుపిహెచ్ సిబ్బంది పని తీరు, అందుబాటులో మెడికల్ ఆఫీసర్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ 35 వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో కళ్ళు పాకలు, ప్రసాద్ గార్డెన్స్, వేలంపేట, మేదర వీధి, పాండా వీధి, స్ప్రింగ్ రోడ్, పందుపుల్ల సందు, ఆయిల్ మిల్ వీధి, ఆర్ఆర్ఎంఆర్ రోడ్డు, పూర్ణా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సంబంధించిన పనులు పూర్తి చేయుటకు 16.75 లక్షలతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. డ్యామేజ్డ్ మాన్ హోల్స్, రైసింగ్ మాన్ హోల్స్ మరియు అవసరానికి కావలసినటువంటి మాన్ హోల్స్ తో పాటు యుజిడి పనులు పూర్తి చేయుటకు శంకుస్థాపన నిర్వహించారు. అదే విధంగా స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ గార్డెన్స్ లో ఉన్న యూపీహెచ్ పరిశీలించగా స్థానిక మెడికల్ అధికారులతో పాటు సిబ్బంది పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన రీతిలో యుపిహెచ్సి మెయింటెనెన్స్ లేదని సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు డిఎంహెచ్వో కు తెలియపరిచారు. మందుల కొరత తో పాటు మెడికల్ ఆఫీసర్ హాజరు కాకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాల సందర్శించి, స్థానిక హెడ్మాస్టర్ వినతి మేరకు ఆర్వో ఆర్వో వాటర్ ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్స్ విల్లూరు భాస్కర్ రావు, స్టేట్ డైరెక్టర్ రామిరెడ్డి, జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు లంక త్రినాథ్, బీజేపీ అధ్యకులు చిన్న, మాజీ కార్పొరేటర్ లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు, కూటమి పార్టీల ఇంచార్జ్ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, డి ఈ, ఎ ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

# రైతుల పంట నమోదు వివరాల మార్పుకు అవకాశం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** 2025 – 26 రబీ సీజన్ నుంచి ఈ-పంట నమోదులో వివరాలు కొన్ని మార్పులు చేసుకునే అవకా శం ప్రభుత్వం కల్పించినట్టు మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్ తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం రైతులకు వారు సాగు చేసిన పంట వివరాలను చూచుకొనుటకు, ఏదైనా తప్పుగా నమోదు చేస్తే ఫిర్యాదు చేయుటకు, ఎలాంటి తప్పు లేకపోతే ధ్రువీకరించుటకు అవకాశం కల్పించార న్నారు. రబీ 2025-26 సీజన్కు సంబంధించి రైతుల కోసం వెబ్ అప్లికేషన్లో కొన్ని సదుపాయాలు ప్రారంభించారన్నారు. పంట నమోదు వివరాలను చూడడం, వాటిని ఆమోదించడం, అభ్యంతరాలు నమోదు చేయడం ఈ సదుపాయాలు వెబ్సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. దానికి గానూ https://www.karshak.ap.gov.in/ecrop, https://www.agriculture.ap.gov.in లింక్ ద్వారా తన ఆధార్ నెంబర్‌తో లాగిన్ అయ్యి, ఈ పంట నమోదు వివరాలను తెలుసుకొని, ఎటువంటి తప్పులు లేనట్లయితే ధ్రువీకరించడం, ఏదైనా తప్పు లుంటే ఫిర్యాదు చేసే అవకాశం రైతులకు కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎస్ఎం ఎస్ రూపంలో రెండు రోజులు ముందుగానే సం బంధిత రైతులకు పంట నమోదు తేదీ సమాచారం ఇవ్వడం జరుగుతుందని, పంట నమోదు చేసిన వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులు మరొక ఎస్ఎంఎస్‌ను రైతులకు పంపడం జరుగుతుంద న్నారు. దాని ద్వారా రైతు తన పొలంలో నమోదు చేసుకున్న పంట వివరాలను తెలుసుకొని వాటిని ధ్రువీకరించడానికి లేదా తిరస్కరించడానికి వీలు కలుగుతుందన్నారు. మండల పరిధిలోని రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే ఏఐ టెక్నాలజీ ద్వారా పంటల సాగు పరిస్థి తులను విశ్లేషణ చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ పంట నమోదుకు చివరి తేది ఫిబ్రవరి 20వ తేదీ అని, ఈలోపు రైతులందరూ తమ పంట వివరా లను నమోదు చేయించుకోవాలని వ్యవసాయా ధికారి మురళీధర్ తెలిపారు.

# ఫ్లెక్సీ చాటున ట్రాన్స్‌ఫార్మర్



**కరప, (రాజధాని వార్తలు):** విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఆనుకుని ఉన్న ఇనుపపోలు ఫ్రేమ్ వల్ల ప్రమాదం పొంచుకుని ఉంది. ఇది ఎక్కడో కాదండీ... కాకినాడ రూరల్, మండల కేంద్రం కరప జాతీయ రహదారి పక్కన ఉన్న నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడకు సమీపంలోనే ఉంది. స్కూలు క్రీడా ప్రాంగణానికి చేర్చి ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కనిపించకుండా అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ వల్ల ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉంది. ఉదయం వాకర్సు, ప్లే గ్రౌండ్లో క్రికెట్ ఆడు విద్యార్థులు ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారి ఇంటర్వెల్ టైంలో విద్యార్థులు బయటికి వచ్చి గేటు పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు అతి సమయపంలో ఉన్న బోర్డింగ్స్. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌కు సమీపానికి వెళ్లి షాక్‌కి గురై ప్రాణాలు పోగొట్టుకున్న వార్తలు ప్రతి చోటా వింటున్నాం. అలాంటిది ఫ్లెక్సీ అమర్చేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ పైపు ట్రాన్స్ఫార్మర్‌కి అతి దగ్గరగా ఉండటం ఫ్రేమ్ ఐరన్ రిబ్బులతో ఏర్పాటు చేయడం వల్ల స్కూల్ గ్రౌండ్‌లో ఆటలాడుకునే విద్యార్థిని విద్యార్థులకు, వాకర్లకు ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగానే ఉంది. గతంలో ఫ్లెక్సీ ఉండేది దానిని అధికారులు తొలగించారు. కరప మండలం కాకినాడ నుండి రామచంద్రపురం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డుకి అతి సమీపంలో బోర్డింగ్స్ ఏర్పాటు చేయడం వల్ల, జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ప్రహరీ గోడ పొడవునా బోర్డింగ్స్ ఎక్కువై వాహన సాధకులు, బస్సు వస్తుంటే పక్కకు వెళ్లే దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటివల్ల కొన్ని ప్రమాదాలు జరిగాయని స్థానికులు వాపోతున్నారు. ఈ స్కూల్‌కి అతి సమీపంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి విధులకు హాజరయ్యేందుకు నిత్యం ప్రయాణిస్తున్న పంచాయతీ అధికారులు ఈ దృశ్యాన్ని చూస్తూ తమకేమీ సంబంధం లేదన్నట్టు చోద్యం చూస్తున్నారని స్థానికులు, వాకర్సు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీ ఫ్రేమ్ వల్ల ఏ విధమైన ప్రమాదం జరగకముందే కరప గ్రామ పంచాయతీ సిబ్బంది గానీ, సంబంధిత ఎలక్ట్రికల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# 'బా బా బ్లాక్ షీప్' టీజర్: మిస్టరీ బాక్స్ కోసం క్రేజీ వేట!



టాలీవుడ్‌లో ఇప్పుడు క్రైమ్ కామెడీల ట్రెండ్ నడుస్తోంది. లేటెస్ట్‌గా అదే జోనర్‌లో వస్తున్న సినిమా 'బా బా బ్లాక్ షీప్'. 'నారీ నారీ నడుమ మురారి' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఫుల్ జోష్‌లో ఉన్న శర్వానంద్, వసంత పంచమి సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ చూస్తుంటేనే ఇది ఒక స్టైలిష్ అండ్ ఫన్నీ రైడ్‌లా ఉండబోతోందని అర్థమవుతోంది. మేకర్స్ విజువల్స్ అండ్ మేకింగ్ విషయంలో అస్సలు తగ్గలేదని టీజర్ ప్రూవ్ చేస్తోంది. ఈ సినిమా కథ అంతా ఒక మిస్టరీ బాక్స్ చుట్టూ తిరుగుతుంది'. ఆ బాక్స్ ఎక్కడుంది? దాని కోసం గ్యాంగ్ ఎలా వెతుకుతోంది? అనేదే అసలు మ్యాటర్. గన్స్, గోల్డ్ గందరగోళం కలగలిసిన ఈ కథలో ఆరుగురు విభిన్నమైన వ్యక్తులు చేసే వేట చాలా ఫన్నీగా ఉండబోతోంది. ఒక ఫ్లాంబోయంట్ గ్యాంగ్‌స్టర్, అతనికి అస్సలు సెట్ అవ్వని ఫ్రెండ్స్, వింతగా ప్రవర్తించే క్రిమినల్స్ మధ్య జరిగే ఈ ఛేజింగ్ గేమ్ ఆడియన్స్‌కు ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఇస్తుందని టీజర్ హింట్ ఇచ్చింది. దర్శకుడు గుని మంచి కంటి ఈ క్రైమ్ ప్లాట్‌ను చాలా తెలివిగా డిజైన్ చేశారు. మనుషుల్లో ఉండే అత్యాశ క్రైమ్ వల్ల జరిగే పొరపాట్లను కామెడీగా చూపించడమే ఈ సినిమా మెయిన్ థీమ్. పంచ్ డైలాగులు ఈ మూవీకి హైలైట్‌గా నిలుస్తాయని నిర్మాత వేణు దోనేపూడి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తరుణ్ భాస్కర్ ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు. ఇక ఈ సినిమాకు ఉన్న మరో క్రేజీ స్పెషాలిటీ ఏంటంటే.. టోటల్‌గా మేఘాలయలో షూట్ చేసిన ఫస్ట్ మూవీ ఇదే. ఈ ఈశాన్య రాష్ట్రంలోని అందమైన లొకేషన్ల ప్రకృతి సౌందర్యాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. మేఘాలయ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్ట్‌కు ఫుల్ సపోర్ట్ ఇచ్చింది.

అక్కడి సీఎం కాన్రాడ్ కె సంగ్మా కూడా ఈ సినిమా ద్వారా తమ రాష్ట్ర పర్యాటక రంగం డెవలప్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి ఒడిలో సాగే ఈ క్రైమ్ డ్రామా విజువల్‌గా ఒక కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుందట. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ సినిమాలో టిన్నూ ఆనంద్, ఉపేంద్ర లిమాయే, జార్జ్ మరియన్ వంటి సీనియర్లు నటిస్తున్నారు. అలాగే అక్షయ్ లాగుసాని, విష్ణు ఓయ్‌లాంటి యంగ్ టాలెంట్ కూడా ఉంది. అజయ్ అబ్రహం జార్జ్ సినిమాటోగ్రఫీ, ఆనంద్ అందించిన మ్యూజిక్ టీజర్‌లో అదిరిపోయాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా సమ్మర్ రేసులోకి రావడానికి సిద్ధమవుతోంది. 'బా బా బ్లాక్ షీప్' టీజర్ ఒక వెరైటీ క్రైమ్ కామెడీని ప్రామిస్ చేస్తోంది. బాక్స్ దొరుకుతుందా? లేదా? ఈ ఆరుగురిలో విన్నర్ ఎవరు? అనే విషయాలు తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

# ష్.. అందాలతో చెమటలు పట్టిస్తున్న లేడీ బాస్ !



టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి అందం, అభినయంతో ఆకట్టుకుంటూ తమకంటూ ఒక పేరు దక్కించుకున్న హీరోయిన్స్ చాలామందే ఉన్నారు. అలాంటి వారిలో హీరోయిన్ నేహా శెట్టి కూడా ఒకరు. మొదటిసారి ప్రముఖ దిగ్గజ దర్శకుడు పూరీ జగన్నాథ్ కుమారుడు ఆకాష్ పూరీ నటించిన 'మెహబూబా' చిత్రం ద్వారా హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమైంది నేహా శెట్టి. ఈ సినిమా సక్సెస్ కాకపోయినా తన యాక్టింగ్‌తో.. అందంతో అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత నటించిన చిత్రాలు పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ డీజే టిల్లు సినిమాతో భారీ క్రేజ్ సంపాదించుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇందులో సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించగా.. నేహా శెట్టి హీరోయిన్గా నటించింది. రాధికా పాత్రతో అద్భుతమైన ఇమేజ్ సొంతం చేసుకుంది. ఇక నేహా శెట్టి బయట ఎక్కడ కనిపించినా సరే ఈమెను రాధిక అంటూ పిలవడం మొదలు పెట్టారట ఆడియన్స్. దీన్ని బట్టి చూస్తే రాధికా పాత్రకు నేహా శెట్టి ఏ రేంజ్‌లో న్యాయం చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక వైపు సినిమాల్లో అలరిస్తున్న ఈమె మరోవైపు నిరంతరం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ పలు రకాల గ్లామర్ ఫోటోలతో కుర్రాళ్లకు కొనుక్కు లేకుండా చేస్తోంది. తాజాగా టాప్ టు బాటమ్ కోట్ ధరించి తన అందాలతో మతులు పోగొడుతోంది. సోఫా పైన వయ్యారంగా కూర్చొని ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. పైగా ష్.. అంటూ ఫోటోలకు ఫోజులు ఇవ్వడంతో అభిమానులు లేడీ బాస్ ఇస్ బ్యాక్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొంతమంది నెటిజెన్స్ ఆ సోఫా నేనైతే బాగుండు అంటూ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. నేహా శెట్టి చివరిగా గత ఏడాది ఓజీ సినిమాలో స్పెషల్ సాంగ్లో కనిపించింది.

అలాగే తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ నటిం చిన డ్యూడ్ సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా కూడా సక్సెస్ కావడంతో ఈ ముద్దుగుమ్మకు వరుస అవకాశాలు వెలువడుతున్నాయి. నేహాశెట్టి కర్ణాటకలోని మంగళూరులో పుట్టి..బెంగళూరులో పెరిగింది. ఈమె తండ్రి వ్యాపారవేత్త కాగా, తల్లి దంత వైద్యురాలు. నేహా శెట్టికి ఒక సోదరి కూడా ఉంది. సినిమాల్లోకి రావాలనుకున్న ఈమె అందులో భాగంగానే మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. అలా తొలిసారి 2014లో మిస్ మంగళూరు పోటీలలో పాల్గొని టైటిల్ విజేతగా నిలిచింది. ఆ తర్వాత 2015లో మిస్ సౌత్ ఇండియా 2015 పోటీలలో పాల్గొని రన్నరప్ గా నిలిచింది.. ఇక ప్రముఖ దర్శకుడు శశాంక్ తీసిన కన్నడ చిత్రం ముంగారు మలే 2 లో కనిపించి మిక్స్ టాక్ సొంతం చేసుకుంది. అయినా సరే ఇందులో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ.

# శర్వానంద్ సెకెండ్ ఇన్నింగ్స్ అందుకున్నట్లేనా!



యంగ్ హీరో శర్వానంద్ కి సరైన సక్సెస్ పడి చాలా కాలమతుంది. 'మహానుభావుడు' తర్వాత నటించిన అన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దీంతో విజయం అన్నది అందని ద్రాక్షలా మారింది.

రకరకాల ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. జానర్లు మార్చినా దర్శకుల్ని మార్చినా ఛేంజ్ అవ్వడం వరకే తప్ప రిజల్ట్ రూపంలో కనిపించలేదు. మరోవైపు వివాహం చేసుకుని జీవితంలో సెకెండ్ ఇన్నింగ్స్ కూడా ప్రారంభించాడు. ఆ సెంటిమెంట్ అయినా కలిసొచ్చిందా అంటే అదీ జరగలేదు. ఏదైతేనేం మొత్తానికి తొమ్మిదేళ్ల తర్వాత 'నారీ నారీ నడుమ మురారీ'తో డీసెంట్ హిట్ అందుకున్నాడు. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన సినిమాకు మంచి రివ్యూలు వచ్చాయి. పబ్లిక్ టాక్ బాగుంది. సినిమాపై ఎక్కడా నెగివిటీ స్ప్రెడ్ అవ్వలేదు. పోటీగా కొన్ని సినిమాలున్నా? శర్వా సినిమాకు వెళ్లాల్సిన జనాలు వెళ్తున్నారు. థియేటర్లను పెంచితే ఇంకా మంచి వసూళ్లు సాధించడానికి అవకాశం ఉంది. కానీ మిగతా రెండు సినిమాలు కూడా బాగా ఆడటంతో ఇప్పట్లో థియేటర్లో దొరకడం కష్టం. థియేటర్లలో షోస్ ను అడ్జస్ట్ చేయగల్గినా బాక్సాఫీస్ వద్ద నెంబర్లు బాగుంటాయి. సక్సస్ పరంగా శర్వానంద్ సంతోషంగా ఉన్నాడు. చాలా కాలం తర్వాత వచ్చిన విజయాన్ని కుటుంబం, స్నేహితులతో సెలబ్రేట్ చేసుకుంటున్నాడు.

# తరుణ్ భాస్కర్ 'ఓం శాంతి ఓం'.. ట్రైలర్ ఎలా ఉందంటే?




డైరెక్టర్‌గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు హీరోగా మరోసారి ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఆయన హీరోగా, ఈషా రెబ్బ హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతిః. మలయాళంలో సూపర్ హిట్‌గా నిలిచిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్‌గా తెరకెక్కుతున్న ఆ మూవీకి ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 30న థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు మేకర్స్. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా ద్వారా ట్రైలర్ రిలీజ్ చేయడం విశేషం. సినిమా మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అయితే ట్రైలర్ విడుదలైన వెంటనే ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. మొదటి నుంచి చివరి వరకు కూడా ఫన్నీగా సాగిన ట్రైలర్ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ట్రైలర్ చూస్తే, సినిమా కథ భార్యాభర్తల మధ్య జరిగే సంఘటనలు చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. కోపం ఎక్కువగా ఉండే యువకుడితో పెళ్ళైన అమ్మాయి పరిస్థితి, ఆ తర్వాత ఆమె ఎదుర్కొనే సమస్యలు, భర్త ప్రవర్తనను ఎలా మార్చుకుంటుందన్నదే కథాంశం. కామెడీతో పాటు ఎమోషన్స్ కూడా బాగా మేళవించినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా భార్యపై భర్త డామినేషన్ చేయడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు నవ్వులు పూయిస్తున్నాయి. సినిమాలో తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా తమ పాత్రల్లో సహజంగా ఒదిగిపోయినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయిందని సినీ విశ్లేషకులు అంటున్నారు. డైలాగ్స్, కామెడీ టైమింగ్, ఎమోషనల్ సీన్స్ అన్నీ కలిపి ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతుంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా అదిరిపోయేలా ఉంది. నిజానికి మలయాళ హిట్ జయ జయ జయ జయహేకి రీమేక్ కావడంతో ముందుగానే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఒరిజినల్ వెర్షన్‌లో భార్య పాత్రకు మంచి ప్రాధాన్యం ఉండటం విశేషం. అదే తరహాలో తెలుగు వెర్షన్‌లోనూ ఫిమేల్ లీడ్ రోల్ స్ట్రాంగ్‌గా ఉంటుందని అర్థమవుతోంది. కథలోని మెసేజ్ తో పాటు ఎంటర్టైన్మెంట్ కూడా సమానంగా అందించడమే లక్ష్యంగా రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఓం శాంతి శాంతి శాంతిః మూవీ విడుదలకు సిద్ధమైంది. జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానున్న ఆ సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మంచి విజయాన్ని సాధిస్తుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రైలర్‌కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే.. మూవీ థియేటర్లలో మంచి సందడి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి చూడాలి ఏం జరుగుతుందో.

# పూర్వోదయ పథకం ద్వారా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

**- నాలుగు ప్రాజెక్టులకు రూ.1300 కోట్లు విడుదల : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - ఇరిగేషన్ ప్రాజెక్టులపై కలెక్టరేట్లో సమీక్ష**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పూర్వోదయ పథకం ద్వారా జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ఫ్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు రూ.1300 కోట్లతో నాలుగు ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రణాళికను తయారు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, సాగునీటి వనరులపై కలెక్టరేట్లో గురువారం ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. తోటపల్లి, తారకరామ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, గడిగెడ్డ, పెద్దగెడ్డ తదితర ప్రాజెక్టుల అభివృద్ధి, మరమ్మ తులు, కాలువల్లో పూడిక తీత, భూ సేకరణ, పునరావాసం తదితర ప్రజా ప్రతినిధులతో కలిసి అంశాలపై చర్చించారు. ఆయా ప్రాజెక్టుల ఇంజనీర్లతో మాట్లాడి పురోగతిని తెలుసుకు న్నారు. పూర్తి చేయడానికి కావాల్సిన వనరుల సమీకరణ, పనులపై చర్చించారు. ప్రాజెక్టుల పరిస్థితులను, తీసుకోవాల్సిన చర్యలను జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి వివరించారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తామని చెప్పారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకట్రావు, కోళ్ల లలిత కుమారి, పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ, సాగునీటి వనరులకు సంబంధించిన వివిధ అంశాలను, సమస్యలను ప్రస్తావించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వదయ పథకం ద్వారా రూ.1300 కోట్లతో తోటపల్లి, తారకరామా ప్రాజెక్టుల పెండింగ్ పనులు, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, గడిగెడ్డ - చంపావతి అనుసంధాన పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సుమారు రూ.2,000 కోట్లను కేటాయించిందని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం 58వేల ఎకరాలకు నీరు అందుతుందని, మిగిలిన భూములకు సాగునీరు అందించేందుకు పనులను పూర్తి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని, ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ 18 నెలల కాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో సుమారు 8 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిని మరమ్మతులు చేయడం ద్వారా దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద పూర్తి పారదర్శకంగా సుమారు రూ.600 కోట్ల రూపాయలతో కన్వర్జెన్సీ పనులను చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు కృషి చేశామన్నారు. ఈ 18 నెలల కాలంలో రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మందికి భాగస్వామి పింఛన్లను మంజూరు చేశామని, కొత్త పింఛలను త్వరలో అందించేందుకు కార్యాచరణను రూపొందించామని తెలిపారు. ఒక్క అర్హత లేని దివ్యాంగులకు తప్ప, తమ ప్రభుత్వ హయంలా ఏ ఒక్కరికి పింఛను తొలగించలేదని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎం ఎస్ ఎం ఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గుర్ల స్టీల్ పరిశ్రమ, బొబ్బిలిలో మరో కొత్త పరిశ్రమ త్వరలో ఏర్పాటు కానున్నాయని మంత్రి తెలిపారు. మాజీ మంత్రి, సీనియర్ శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 90 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నామని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ప్రాజెక్టులన్ని కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకుండా, పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. వాటిని పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం సహాయశక్తిలా కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ మురళి, చీఫ్ ఇంజనీర్ కేవిఎన్ స్వర్ణకుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.అప్పలనాయుడు, పి.సుధాకర్ రావు, కార్య నిర్వాహక ఇంజనీర్లు హెచ్ మన్మధరావు, వై గన్నిరాజు, పి. అప్పలనాయుడు, ఎం వెంకటరమణ, డిఎస్ ప్రదీప్, బి గోవిందరావు, ఏ ఉమేష్ కుమార్ పలువురు డిఈలు తదితరులు పాల్గొన్నారు.

# జపద్మనాభంలో వైసీపీ సమరశంఖం : కార్యకర్తల్లో జోష్ నింపిన మజ్జి శ్రీనివాసరావు, సిరమ్మ







**పద్మనాభం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ , ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేసేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. పద్మనాభం మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల స్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**క్షేత్రస్థాయిలో పోరాడదాం : మజ్జి శ్రీనివాసరావు పిలుపు**

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఉత్తరాంధ్ర రీజనల్కో-ఆర్డినేటర్ కూరసాల కన్నబాబు, విశాఖ జిల్లా పార్టీ ఆధ్యక్షులు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, ఉత్తరాంధ్ర జోన్-1కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో గళమెత్తాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ప్రజలకు అండగా నిలవడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. మరియు కార్యకర్తలకు ధైర్యం నూరి పోశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా పక్షమేనని, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసారు.

**యువతకు స్ఫూర్తిగా సిరమ్మ**

ఈ సమావేశంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆమె, కార్యకర్తలను పేరు పేరునా పలకరిస్తూ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. వారసత్వం అంటే కేవలం పదవి కాదు, ప్రజల పట్ల ఉండే బాధ్యత అని ఆమె తన నడవడికతో చాటి చెప్పారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లో క్రియాశీలకం చేయడంలో సిరమ్మ కీలక పాత్ర పోషిస్తున్నారు. “నాయకుడు అంటే కార్యకర్తలతో కలిసి నడిచే వాడు” అనే సిద్ధాంతంతో ఆమె క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తలకు, నాయకత్వానికి మధ్య వారధిలా నిలుస్తూ ఆమె చూపిస్తున్న చొరవ భీమిలి నియోజకవర్గ యువతకు గొప్ప స్ఫూర్తినిస్తోంది.

**నాయకుల ఐక్యమత్యం**

ఈ కార్యక్రమంలో విశాఖ వైస్ జెడ్పీ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కె రాంబాబు, బుగత సత్యనారాయణ, తలాడ పద్మనాభం (పద్దు)తో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. సిరమ్మ రాకతో పద్మనాభం మండల పార్టీలో కొత్త జోష్ నెలకొందని, పార్టీ బలోపేతానికి ఆమె చేస్తున్న కృషి భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మహిళా హక్కుల కోసం ఐక్య పోరాటాలు

**- ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి - స్త్రీ అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి - లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్ - మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి**

**- రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వి వరలక్ష్మి - మహిళ బాగుంటేనే సమాజం బాగుంటుంది - గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత - మహాసభల విజయవంతనికై ఐద్వా ఆధ్వర్యంలో 2 కె రన్**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** మహిళా హక్కుల కోసం ఐక్య పోరాటాలను అఖిల భారత మహాసభలలో రూపొందించబోతున్నామని కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి అన్నారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం అఖిలభారత 14వ మహాసభ విజయవంతని కాంక్షిస్తూ గురువారం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టూ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డి సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మందలపు జ్యోతి మాట్లాడారు. ఈనెల 25 నుండి 28 తారీకు వరకు హైదరాబాదు నగరంలో జరిగే అఖిలభారత మహాసభలలో భవిష్యత్తు ఉద్యమాలపై పలు తీర్మానాలు చేబోతున్నామని అన్నారు. ఉద్యమాల పురిటి గడ్డ తెలంగాణలో మల్లు స్వరాజ్యం చిట్యాల ఐలమ్మ వంటి ఎందరో మహిళ యోధులు నిర్వహించిన పోరాటాలు స్ఫూర్తితో మహిళా సంఘం మహాసభలను విజయవంతం చేస్తామని అన్నారు. దేశంలో బిజెపి అధికారం చేపట్టిన నాటినుండి మహిళలపై దాడులు రోజురోజుకి పెరిగిపోతున్నాయని మహిళల వస్త్రధారణ పై సామాజిక మాధ్యమాల ద్వారా విష ప్రచారాన్ని నిర్వహిస్తూ మహిళలను అఘోరపరుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**స్త్రీ అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి : లైన్స్ క్లబ్ అధ్యక్షులు కమల రాజశేఖర్**

మహిళాభివృద్ధితోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు పిన్నింటి కమల రాజశేఖర్ అన్నారు. ఐద్వా అనేక సందర్భాలలో మహిళలకు అండగా నిలబడి అనేక పోరాటాలను నిర్వహిస్తున్నారని అన్నారు. హైదరాబాదులో జరిగే మహాసభలు విజయవంతం కావాలని ఆ మహాసభలలో మహిళ సమస్యలపై విస్తృతమైన చర్చలు జరగాలని ఆమె ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధి కోసం జరిగే ప్రతి కార్యక్రమంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కమల రాజశేఖర్ హామీ ఇచ్చారు.

**మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి : రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వి వరలక్ష్మి**

మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వరలక్ష్మి కోరారు. నేటి సమాజంలో మహిళను ఒక ప్రచార వస్తువుగా చూస్తున్నారని ఇది సరైన కాదని మహిళల మనోభావాలను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాలలో మాట్లాడటం సరైనది కాదని అన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన స్వేచ్ఛ హక్కులను సైతం కొందరు కాలరాస్తున్నారు అని వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడే ప్రతి ఒక్కరికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.

**మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుంది :గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు చిట్టి లలిత**

గృహిణి బాగుంటేనే ఆ ఇల్లు ఆ కుటుంబం బాగుంటుందని మహిళ అభివృద్ధి చెందుతూనే దేశం అభివృద్ధి చెందుతుందని గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టి లలిత స్పష్టం చేశారు. మహిళా సమస్యలపై ఐద్వా నిర్వహిస్తున్న పోరాటాలు అభినందనీయమని మహిళా సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలు రూపొందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో అఖిల భారత మహాసభ నిర్వహించడం ఈ రాష్ట్రానికే గర్వకారణం అని లలిత అన్నారు. ఐద్వా మహాసభల విజయవంతానికి ప్రతి మహిళ తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మహాసభల విజయవంతం కాక్షిస్తూ ఐద్వా జెండాని జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి ఆవిష్కరించగా 20 వార్డు సభ్యురాలు ఇరుప అనసూయ జిల్లా ఉపాధ్యక్షురాలు నాదెండ్ల లీలావతి జిల్లా కమిటీ సభ్యులు జీవనజ్యోతి ఎర్రంశెట్టి పూర్ణిమ పట్టణ నాయకులు ఉస్తేల జ్యోతి సుబ్బలక్ష్మి నాగలక్ష్మి గజ్జల కృపావతి కొమరం రుక్మిణి కనక శ్రీ గోవర్ధన ఝాన్సీ సీత స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తులను మైనారిటీల అభివృద్ధికి ఉపయోగించాలి




**గూడూరు, (రాజధాని వార్తలు):** వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడితే ఉద్యమిస్తామని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ.శశి కుమార్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా మైనారిటీలు, క్రిస్టియన్లు, దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ ప్రజల ఆస్తులను అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు జమాలుల్లా షేక్ మాట్లాడుతూ అంజుమన్ ఇస్లామియా సంస్థ ఆధీనంలో ఉన్న 71.70 ఎకరాల భూముల వక్ఫ్ స్థలంలో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. మైనారిటీల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మసీదుల ఇమామ్, మౌజన్ల గౌరవ వేతన బకాయిలు రూ. 90 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు మైనారిటీలకు 50 ఏళ్లకు పింఛన్ పథకాన్ని, గత ప్రభుత్వం కూడా పట్టించుకోని దుల్హన్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ సీనియర్ నాయకులు యాదాల సునీల్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సీఈఓగా ముస్లిమేతరులను నియమించడం సరికాదన్నారు. దేవాలయాలలో ముస్లింలను కమిటీ సభ్యులుగా తీసుకోని పక్షంలో ముస్లి మేతరులను వక్ఫ్ బోర్డులో నియమించడం అన్యాయమన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. వక్ఫ్ ఆస్తులను నిర్వీర్యం చేస్తే దేశంలోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, మైనారిటీ, దళిత సంఘాలను కలుపుకుని సీపీఐ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ, ఇన్సాఫ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జీ.శశి కుమార్, షేక్ జమాలుల్లా, వై. సునీల్, సయ్యద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.


# స్థానిక ఎన్నికల్లో బడుగుల సత్తా చాటాలి : రాష్ట్ర గౌడ్స్ కన్వీనర్ భాస్కర్ గౌడ్

**గూడూరు, (రాజధాని వార్తలు):** సంఘటితంగా పోరాటం సాగిస్తేనే రాజకీయాల్లో బడుగులకు మనుగడ సాధ్యమవుతుందని, నాడు మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరామ్ ఆలోచనా విధానంలో రాజ్యాధికార, సామాజిక న్యాయ ఉద్యమాల్లో ఫలితాలు సాధించారని జాతీయ భాయిచార కమిటీ, రాష్ట్ర గౌడ్స్ కన్వీనర్ నాశిన భాస్కర్ గౌడ్ పేర్కొనారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల బలాన్ని నిరూపించుకొనే అవకాశం వచ్చిందన్నారు. కులతత్వ, మతతత్వ, పెట్టుబడిదారి కూటములకు ప్రత్యామ్నాయంగా, బహుజనులకు అధికారం సాధించుకునే లక్ష్యంగా పని చేయాలి. అగ్రకుల ఆధిపత్య కులాల పంచనజేరి వారికి లేని బలాన్ని, మన ఓట్లతో సాధించి ఇస్తున్న దానికి స్వస్తి చెప్పాలన్నారు. మన బలాన్ని బలగాన్ని సమీకరించుకొని, మనలను బలపరిచే పార్టీలు సహకారంతో, మనమే నిజమైన రాజకీయ శక్తులమని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు.

# పారదర్శకంగా పట్టాదారు పాసు పుస్తకాల పరిశీలన

## - జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**భోగాపురం (విజయనగరం), (రాజధాని వార్తలు):** పట్టాదారు పాసు పుస్తకాల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిం చాలని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఆదేశించారు.

ఆయన గురువారం భోగాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డుల పరిశీలన తీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భూమి రికార్డుల ధృవీ కరణ అనేది అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఇందులో ఎటు వంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తప్పులు లేని పాస్ పుస్తకాలను రూపొందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఎం.రమణమ్మ, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ మృతి

- ఘనంగా అంత్యక్రియలు - అంత్యక్రియలలో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి "కొండపల్లి"





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీ.తిరుపతిరావు గురువారం మృతి చెందారు. ఈనెల 14వ తేదీన ముచ్చర్ల గ్రామంలో విధులు ముగించుకుని, తిరుగు ప్రయాణంలో గజపతినగరం వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతిరావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత ఈనెల 20వ తేదీన విజయనగరం ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో చేర్పించగా అప్పటినుంచి చికిత్స పొందుతున్న తిరుపతిరావు గురువారం తుది శ్వాస విడిచారు. దీంతో తిరుపతిరావు కుటుంబ సభ్యులు, గజపతినగరం సర్కిల్ పోలీసు సిబ్బందిలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. తిరుపతిరావుకి భార్య దమయంతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వగ్రామమైన కింతలవానిపేట గ్రామంలో సాయంత్రం జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు బొబ్బిలి డిఎస్పి భవ్య రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యునరల్ గార్డ్‌తో దహన సంస్కరణములు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దహన సంస్కరణల ఖర్చులు నిమిత్తం పోలీస్ శాఖ తరపున లక్ష రూపాయలు తిరుపతిరావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** గత సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగిందని ఈ సంవత్సరం కూడా అదే తరహాలో బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ పటిష్టంగా ఏర్పాట్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ అధ్యకతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలలో వివిధ అవసరాలను వివరించి అధికారులకు ప్రత్యేక సూచనలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఆలయ తరఫున సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతవిస్తూ మంచి వాతావరణంలో దర్శన భాగ్యం కల్పించేలా అందరి సహకారంతో ముందుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తూ, విఐపిలకు నిర్దేశించిన సమయాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. గురువారం ఉదయం స్థానిక శ్రీకాళహ స్తీశ్వర స్వామి దేవస్థానంలోని ఆలయ ఆవరణలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 2026 నిర్వహణపై వివిధ శాఖల సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్.పి సుబ్బరాయుడు, ఆలయ ఈవో బాబిరెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఆర్డీఓ శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, పాలక మండలి సభ్యులతో కలసి జిల్లా అధికారు లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల సమన్వయంతో కొత్తగా ఏర్పాటు అయిన బోర్డు సభ్యులు సహకారం, సలహాలతో నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 2026కి సంబంధించి ఫిబ్రవరి 10 వ తేదీ నుండి ఫిబ్రవరి 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లపై చైర్మన్, ఆలయ ఈఓ, కొత్తగా నియమితులైన 17 మంది బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలపై సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున సామాన్య భక్తులకు ప్రాధా న్యత ఇస్తూ వారికి దర్శన భాగ్యం సజావుగా కల్పించేలా ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన దినాలలో శాంతిభద్రతలు, మౌలిక వసతులు, అన్న ప్రసాదాలు భక్తులకు ఎలా అందజేయాలని అనే విషయాలపై ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకోవడం జరిగిందని, ఈ ఏడాది కూడా ఇంకా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అవసరం మేరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించేలా నిరంతరం సిసి కెమెరాలు, డ్రోన్ నిఘా ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకొని ఈ సంవత్సరం కూడా స్వామి వారి బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున జరిపేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం జిల్లా ఎస్.పి సుబ్బరా యుడు మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచి వాతావరణంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, చైర్మన్, బోర్డు మెంబర్లతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదనంతరం శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి సూచనలు ఇవ్వడం జరిగిందని, వారి సూచనలకు అనుగుణంగా ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటైన ఆలయ బోర్డు ఏర్పాటు అయిందని, బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోర్డు సభ్యులు ద్వారా కావలసిన అన్ని సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. గత సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా ఘనంగా ఉత్సవాలు జరిగేలా సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నూతనంగా ఏర్పడ్డ ట్రస్ట్ బోర్డు సభ్యులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పై సందర్భంగా సలహాలు, సూచనలు తెలియజేశారు. సమావేశ అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి శ్రీ కాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ దేవిని దర్శించుకొన్నారు. దర్శనం అనంతరం ఆలయ ఈవో, చైర్మన్ తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలు జిల్లా కలెక్టర్, ఎస్పీకి అందజేశారు. ఈ సమన్వయ సమావేశంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, పోలీస్ అధికారులు అదనపు ఎస్పీ రవి మనోహరచారి, డీఎస్పీ నరసింమూర్తి, సంబంధిత జిల్లా అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన "సాయి గౌతమి" విద్యార్థులు






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానిక సాయి గౌతమి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.

ఏకంగా ఈ స్కూల్ నుంచి 17 మంది విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్.ఎస్.నాయుడు గురువారం తెలిపారు.


దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షల్లో లక్షలాది మంది విద్యార్థులు పాల్గొనగా తమ విద్యార్థులు 17 మంది ఉత్తమ ర్యాంకులు సాధించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అర్లి ఝాన్సీ 23వ ర్యాంకు, ఒకటవ, రెండవ తరగతి విభాగంలో రాష్ట్ర స్తాయిలో ప్రథమ ర్యాంకులు సాధించిన బుర జయదేవ్, టి.అన్షిత్‌లను అభినందించారు. విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ ఎస్.ఎస్. నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

# స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి : ఏ.పీ.ఎం. నారాయణరావు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్వయం సహాయక సంఘాల బలోపేతము, జీవనోపాధి మెరుగుపరచుకొని ఆదాయ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని వెలుగు ఏపీఎం పి.నారాయణరావు అన్నారు. స్థానిక మండల సమైక్య కార్యాలయంలో గురువారం ఈనారీలు, సిఆర్పిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదరికం నుంచి బయటపడి, వారి వారి సంఘాలను ఉపయోగించుకొని ఏ విధంగా అభివృద్ధి చెందాలి అన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రమణ, సిసిలు మూర్తి, వివోఏలు, ఈనారిలు, సిఆర్పిలు పాల్గొన్నారు.



# శత శాతం సానుకూల ప్రజా స్పందన సాధించాలి : కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** వసతిగృహాల్లో అందుతున్న సేవలపై ప్రజా సానుకూల ప్రతిస్పందన తక్కువగా ఉన్న బిసి, ఎస్సి, ఎస్టీ వసతి గృహాల వార్డెన్లకు మెమో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వసేవలు-ప్రజా స్పందన పై చర్చించి తగు సూచనలు చేసారు. రియల్ టైం గవర్నన్స్, అన్నకేంటీన్లు, నేరాలు, గంజాయి మత్తుపదార్థాలు రవాణా నివారణ, పట్టణాల్లో పారిశుధ్యం, బిసి, ఎస్ సి, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో అందుతున్న సదుపాయాలపై ఐవిఆర్‌ఎస్ ద్వారా అందిన ప్రజాభిప్రాయ సేకరణపై విశ్లేషణ చేసారు. ప్రతి ప్రభుత్వ సేవల్లో శతశాతం సానుకూల ప్రజా స్పందన సాధించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు మెరుగుపర్చాలని ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేదుమాధవన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అబ్బురపరిచిన విద్యార్థులు... ఆర్.బి.ఐ మాజీ గవర్నర్ ప్రశంస



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తమ అభ్యసన సామర్థ్యాలతో ఆర్.బి.ఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మనసును గెలుచుకున్నారు మండలంలోని గంగచొల్లపెంట మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు. గురువారం తన సందర్శనలో భాగంగా గంగచొల్లపెంట ఆదర్శ పాఠశాలకు ఆర్బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వచ్చారు. ముందుగా మూడవ తరగతి విద్యార్థులను గణితంలో సమస్యలను బోర్డుపై ఇచ్చి సమాధానాలు రాయమనగా విద్యార్థులు టకటక ఆన్సర్ చేశారు. అలాగే జనరల్ నాలెడ్జ్ పైన సంధించిన ప్రశ్నలకు అదే రీతిలో సమాధానాలు చెప్పిన విద్యార్థుల స్పందనకు సుబ్బారావు ముచ్చటపడ్డారు. ఐదవ తరగతి విద్యార్థులకు జామెట్రీ, ఎల్సిఎం, హెచ్సిఎఫ్‌లను రాయించారు. ఇలా ఏ ప్రశ్నలు అడిగినా విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను ఇందుకు కారకులైన ఉపాధ్యాయులను, అలాగే మండల విద్యాశాఖ అధికారులను సుబ్బారావు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు ఎస్. విమలమ్మ, అల్లు వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్లాస్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఎస్ కే ఆర్‌లో మెగా జాబ్ మేళా



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెకెసి, సిఐఐ ఎంసిసిఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్, టి.వి.ఎస్, ఎం.ఆర్.ఎఫ్, డైకిన్, బ్లూ స్టార్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందారు. మొత్తం 44 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 26 మందిని ఎంపిక చేసినట్లు వివిధ సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సింహాద్రి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఇలాంటి జాబ్ డ్రైవ్‌ల ద్వారా అవకాశాలను అందిపుచ్చుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా పట్టణ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి నైపుణ్యాలను పెంపొందించుకొని తమ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలని అదేవిధంగా వచ్చిన అవకాశాలను చేజార్చుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సింహాద్రి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ కే కోటేశ్వరరావు, పట్టణ సీఐ శ్రీనివాస్, వివిధ సంస్థల ప్రతినిధులు విమల ప్రియ, నాగరాజు, తులసి, యమున, జయప్రకాష్, నాగరాజు హెచ్‌ఆర్ మేనేజర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం




**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఈఎస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కిషోర్ విచ్చేసినారు. ఈ వైద్య శిబిరం కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడగా పరిసర ప్రాంతాల ప్రజలు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన ఈఎస్ డాక్టర్ కిషోర్, వైద్య బృందం సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్, బరువు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే విశ్వక్సేనారెడ్డి, డైరెక్టర్ దత్తాత్రేయ శర్మలు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. యువత సామాజిక బాధ్యతను గుర్తించి ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈఎస్ సంస్థతో కలిసి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్‌ఆర్‌యస్.వెంకటేశ్వర్లు ఈఎస్ అధికారులు, వైద్యులు, నర్సులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి శిబిరాన్ని విజయవంతం చేశారు. వైద్య శిబిరం ద్వారా ప్రజలు ఎంతో లబ్ధి పొందారని కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంకి సంహరించిన ఏఓ కొండారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు..
# సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ధైర్యం ఉంటే సిట్ విచారణ వీడియో బయటపెట్టాలని సవాల్ విసిరారు. లీకులతో ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారు..? అని ప్రశ్నించారు. రెండేళ్లు దాటినా లీకు రాజకీయాలే నడుపుతారా..? అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం బయట పెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు.

**వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు..**

సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సిట్.. పొట్టు.. లట్టుకి భయపడేది లేదని ఎద్దేవా చేశారు. మీ అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణిలో సోలార్ పవర్ స్కాం బయట పడిందని ఆరోపించారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని తెలిపారు. నేడు సింగరేణి సృజన్ గనిగా మారిందని విమర్శలు చేశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రుల పంచాయతీ కాంగ్రెస్‌కు ఉరితాడులా మారిందని ఆక్షేపించారు. సృజన్ వ్యవహారం బయట పెట్టిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేదని విమర్శించారు.

**తప్పుడు ప్రచారం చేస్తున్నారు..**

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహించారు. సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. లోపల ఏదో జరుగుతోందని తప్పుడు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారని నిలదీశారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు.

# మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తొట్టంబేడు మండల వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, కన్నలి భాస్కర్ రెడ్డి దంపతులు విజయవాడలోని తాడేపల్లి స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే పాదయాత్ర కార్యక్రమం చేపట్టనున్నానని జగన్మోహన్ రెడ్డి వారికి మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి తెలిపారు. వైసిపి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించినట్లు తెలిపారు. పార్టీని నమ్ముకుని కష్టపడుతూ ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని వారికి భరోసా ఇచ్చినట్లు తెలియజేశారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan